పీర్ల పండుగకు వేళాయె

- రేపటి నుంచి వేడుకలు ప్రారంభం
- గ్రామాల్లో సందడే సందడి
- మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం

బత్తలపల్లి: హిందూ ముస్లింలందరూ కలిసికట్టుగా జరుపుకునే మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇది పేరుకు ముస్లింల పండుగైనా హిందువులు కూడా సంక్రాంతి, ఉగాది, దీపావళి, దసరాలతో సమానంగా ప్రాధాన్యతనిస్తూ జరుపుకుంటున్నారు. కుల మతాలకతీతంగా వెండి, ఇత్తడి పంచలోహాలతో ఎవరి శక్తికొద్ది వారు మొక్కుల రూపంలో పీర్లను తయారు చేయించి ప్రార్థనలు చేయడం విశేషంగా చెప్పుకోవచ్చు. తాము చేయించిన పీర్లకు ఏటా మొహర్రం సందర్భంగా భక్తులు పూలు, వస్త్రాలు అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఏటా మొహర్రం నెలలో నెలవంక కన్పించిన మూడవ రోజు అంత వరకు పెట్టెలో భద్రపరిచిన పీర్లను నిర్వాహకులు దించి, చదివింపులు చేసి ప్రత్యేక ప్రార్థనలతో పీర్ల చావిడిలో నిలుపుతారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళ్లలో పీర్లను ఊరేగిస్తారు. ఈ పర్వదినాలలో చివరి మూడు రోజులు ముఖ్యమైనవి. పీర్ల ముందు అగ్నిగుండాలు ఏర్పాటు చేసి పీర్లను మోస్తూ అందులో నడుస్తారు. మొహర్రం రోజు ఉదయం పీర్లు సలాములందుకుంటాయి. అనంతరం సాయంత్రం అమరులైన పీర్లను తిరిగి ఊరేగించి రకరకాల వేషధారణలతో కర్రసాములతో ఒకరిపైనొకరు గంధం, రంగులు చల్లుకుంటూ పండుగను వైభవోపేతంగా నిర్వహిస్తారు.


బత్తలపల్లిలోని కాశీంస్వామి(ఫైల్)

పానకం కడవలతో నైవేద్యం..

పెద్దగుండం, చిన్నగుండం కాలే రెండు రోజులు తమ గృహాల నుంచి డప్పులు, మేళ తాళాలతో భక్తులు పానకం కడవలను, పంచదార, బెల్లాన్ని పీర్ల వద్దకు తెచ్చి చదివింపులు ఇచ్చి నైవేద్యాన్ని అందరికీ పంచి మొక్కులు తీర్చుకుంటారు. దీని వల్ల తమ కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. బత్తలపల్లి మండలంలోని బత్తలపల్లి, గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి, లింగారెడ్డిపల్లి, సంజీవపురం, రాఘవంపల్లి, యర్రాయపల్లి, అనంతసాగరం, వెంకటగారిపల్లి, మాల్యవంతం, అప్రాచెరువు, తంబాపురం, గరిశలపల్లి, కోడేకండ్ల, ఓబుళాపురం , నల్లబోయనపల్లి తదితర గ్రామాలతో పాటు జిల్లాలోని పలు గ్రామాల్లో హిందూ ముస్లింలు కలిసికట్టుగా ఈ వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు.


బత్తలపల్లిలోని పీర్ల చావిడి

మొహర్రం విశిష్టత..

ముస్లిం క్యాలెండర్ హిజ్రీ ప్రకారం 12 మాసాల్లో మోహర్రం మొదటి నెల. ఈ నెలలో నెలవంక కనిపించిన మూడవ రోజు నుంచి మొహర్రం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఇస్లాం మత ధర్మం కోసం దేవుని మార్గంలో ప్రాణాలర్పించిన త్యాగమూర్తిగా హజరత్ ఇమామ్ హుసేన్ నిలిచాడు. మహమ్మద్ ప్రవక్త ముని మనవడైన ఆయనను స్మరించుకుంటూ ఈ ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీ. మొహర్రం పండుగకు పీర్ల పండుగ అని కూడా పిలువడం పరిపాటి. ఈ నెల 7 నుంచి మొహర్రం పండుగను జరపడానికి మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి ఆయా గ్రామాల్లో గ్రామ పెద్దలు చర్చించుకుంటున్నారు. పోలీసుల అనుమతులను కోరుతున్నారు.

క్లుప్తంగా

వాటర్ ప్లాంట్ల తనిఖీ


నీటి నాణ్యతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అంజనప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భానుప్రకాష్

కదిరి అర్బన్: పట్నం గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్లు, వాటర్ ట్యాంక్‌లను శుక్రవారం ఎంపీడీఓ అంజనప్ప, సర్పంచ్ చలపతి నాయక్,ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భానుప్రకాష్ తనిఖీ చేశారు. వాటర్ ట్యాంక్‌లోని నీటిలో పీహెచ్, ఫ్లోరైడ్ శాతాలు పరిశీలించారు. పరీక్షల నిమిత్తం శాంపుల్స్ సేకరించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వనజ, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి


పాఠశాల సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంఈఓలు

ఎన్‌పీకుంట: పాఠశాలలో రోజువారి రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి కేజీబీవీ ఉపాధ్యాయినులకు సూచించారు. శుక్రవారం ఎంఈఓలు స్థానిక కేజీబీవీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఎం.పావనికి బాధ్యతలు అప్పజెప్పారు. ఇటీవల పలువురు ఉన్నతాధికారులు పాఠశాలను సందర్శించిన సమయంలో పాఠశాల ప్రిన్సిపాల్ విధులకు హాజరుకాలేదు. దీంతో అధికారులు ఆమెను ప్రిన్సిపాల్ బాధ్యతల నుంచి తప్పించారు. అనంతరం వారు సిబ్బందితో మాట్లాడుతూ రోజువారీ నైట్‌డ్యూటీలు తప్పనిసరిగా చేసుకోవాలని ఆదేశించారు. విద్యాప్రమాణాలు మెరుగుపరచడానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

సదరం క్యాంపు ప్రారంభం


సదరం క్యాంపులో వివరాలు సేకరిస్తున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి


ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం సదరం క్యాంపులు ప్రారంభమయ్యాయని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి తెలిపారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి సదరం క్యాంపునకు ప్రత్యేక వైద్యుడుగా నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆయన 19 మంది వికలాంగులను పరీక్షించారు. వారందరూ 20 రోజుల్లో సర్టిఫికెట్లు మీసేవలో గాని, సచివాలయంలో గాని పొందవచ్చునని తెలిపారు. ఈ సర్టిఫికెట్‌లో శరీర వైకల్య శాతం తెలుస్తుందన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించండి


టమాట పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సనావుల్లా

కదిరి అర్బన్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి ఆరోగ్యకరమైన పంటలు పండించాలని ప్రకృతి వ్యవసాయ పంటల ఏడీఏ సనావుల్లా రైతులకు సూచించారు. శుక్రవారం దిగువపల్లి గ్రామంలోని రైతులకు ఘన, జల, జీవామృతాల తయారీ విధానాన్ని ఆయన వివరించారు. ఎరువులు, పురుగుల మందుల వాడకం తగ్గిస్తే రైతుకు ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. గ్రామంలోని రైతు గంగినాయుడు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి సాగు చేస్తున్న టమాట పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం


రోగులకు అన్నదానం చేస్తున్న శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు రోగులు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహించారు. దాత దాసరి తులసమ్మ, వెంకటస్వామి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు శ్రీ సత్యసాయి సేవా సమితి సహకారంతో 360 మందికి అన్నదానంతోపాటు గర్భిణులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ముదిగుబ్బ: ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. మంగళమడక గ్రామానికి చెందిన కిరణ్‌మోహన్‌రెడ్డి, ముదిగుబ్బకు చెందిన ఉప సర్పంచ్ లోకేశ్వర్‌రెడ్డి, మర్రి కుల్లాయప్పను కేతిరెడ్డి శుక్రవారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి నారాయణరెడ్డి, కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, సర్పంచ్ వెంగళరెడ్డి, నాయకులు యోగానందరెడ్డి, చంద్రాయుడు, మునీంద్ర, మనోహర్‌రెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.


బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి: డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బుక్కపట్నం హెల్త్ సూపర్‌వైజర్ రామ్మోహన్ చౌదరి సూచించారు. ఆయన శుక్రవారం సిబ్బందితో కలిసి బుక్కపట్నంలోని వీధుల్లో పర్యటించారు. వీధుల్లో వర్షపు, మురుగునీరు నీటి నిల్వ ఉన్న ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇంటి పరిసరాలలో వర్షపు నీరు, మురుగునీరు లేకుండా చూడాలని, అలా నీరు నిలిచి ఉంటే ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లించాలని పంచాయతీ, వైద్య సిబ్బందికి సూచించారు..అనంతరం మండలంలోని బుచ్చయ్యగారిపల్లిలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించి అతిసార నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అతిసార సోకిన వారు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. చేతులు శుభ్రపరుచుకోవటంతో పాటు తాగునీటి శుభ్రత, పరిసరాల పరి శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మురళి, కార్యదర్శి వర్షా, ప్రియదర్శిని, వైద్య సిబ్బంది అరుణ, భారతి తదితరులు పాల్గొన్నారు.


బుక్కపట్నం వీధిలో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న వైద్య సిబ్బంది

చట్టాలపై అవగాహన అవసరం

చెన్నేకొత్తపల్లి: ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆదిశక్తి సొసైటీ అధ్యక్షురాలు అశ్వర్థమ్మ సూచించారు. టింబక్టు కలెక్టివ్ వారి సహకారంతో నిర్వహించబడుతున్న ఆదిశక్తి సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని ముష్టికోవెల గ్రామంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈఓ కవిత మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు చట్టాలపైన అవగాహన లేకపోవడం వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా మహిళలు గృహహింసతో పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చట్టాలపై అవగాహన ఉంటే వాటిని పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. గృహహింస, బాల్య వివాహాలు, తాగుడు వలన మహిళలు పడుతున్న కష్టాలపై నాటక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మహాశక్తి సొసైటీ సభ్యులు గౌరి, పావని తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదిశక్తి సొసైటీ సీఈఓ కవిత

దేశ సేవపై ఆసక్తి పెంచుకోండి

పరిగి: విద్యార్థి దశ నుంచే దేశ సేవపై ఆసక్తి పెంచుకోవాలని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు అన్నారు. కొడిగెనహళ్లిలోని ఆ పాఠశాలలో శుక్రవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 2022- 2024 సంవత్సరంలో ఎన్‌సీసీలో శిక్షణ పొంది, ఉత్తీర్ణత సాధించిన 53 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించి అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుతో పాటూ క్రీడలు, సమాజసేవ కూడా ముఖ్యమన్నారు. ఉత్తీర్ణత సాధించిన వారందరికీ 6ఏ బెటాలియన్ నుంచి వచ్చిన ఆర్మీ అధికారి విజయకుమార్ లింబు చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందించారు. ఎన్‌సీసీలో విద్యార్థులను ప్రోత్సహించి, ప్రతిభావంతులుగా తయారు చేయడంలో శిక్షణ ఇచ్చిన పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్లు కృష్ణ, అరుణ్‌కుమార్‌ను వారు ప్రశంసించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

అమడగూరు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం వైద్యాధికారి అపర్ణ గర్భిణులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ గర్భిణులు ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం సలహాలను ఎప్పటికప్పుడు పాటించాలన్నారు. గ్రామాల్లో విరివిగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలను తినడం ద్వారా మంచి పౌష్టికాహారం లభిస్తుందన్నారు. తద్వారా తల్లీ, బిడ్డ ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఆరోగ్యంలో ఏదేని తేడాలు వచ్చినా వెంటనే ప్రభుత్వాస్పత్రిలో సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పు చేయించుకోవాలని సూచించారు.

రైతులకు నాణ్యమైన ఎరువులు అందించండి

కొత్తచెరువు: రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు అందించాలని మండల వ్యవసాయాధికారి నటరాజ్ ఫర్టిలైజర్ దుకాణదారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలో మన గ్రోమోర్, సాయి ట్రేడర్స్, లక్ష్మిగణేష్ ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. సరుకు నిల్వలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులు వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలు సాగుచేస్తున్నారన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు నాణ్యమైనవి అందించాలని ఎరువుల దుకాణాదారులను ఆదేశించారు. కల్తీ విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. ఎరువుల దుకాణాదారులు ఎమ్మార్పీకే సరుకు విక్రయించాలన్నారు. కాలంచెల్లిన సరుకును విక్రయించొద్దని సూచించారు.


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ నటరాజ్

ఆర్డీఓ సుడిగాలి పర్యటన


నల్లచెరువులో బీసీ హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ వంశీకృష్ణ

నల్లచెరువు: మండలంలో కదిరి ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాలలో నూతన భవనాల నిర్మాణ పనులపై అధికారులును అడిగి తెలుసుకున్నారు. అలాగే పూలకుంట రోడ్డులోని బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వార్డెన్ లక్ష్మీనారాయణతో కలిసి హాస్టల్లోని వంటగది, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు హాస్టల్‌లోని వసతుల పట్ల ఆర్డీఓ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. వైద్యధికారులు సమయ పాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులపట్ల మర్యాద పూర్వకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంఈఓలు తిరుపాల్ నాయక్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన కల్పించండి


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డీపీఎంఓ కుళ్లాయప్పనాయక్

పుట్టపర్తి రూరల్: సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ సమావేశ భవనంలో జిల్లా వైద్యారోగ్య శాఖ పర్యవేక్షణ అధికారి కుళ్లాయప్పనాయక్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించేలా చైతన్యం తేవాలన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్యతోపాటు మున్సిపల్, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు

భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి

ఎన్‌పీకుంట: వ్యవసాయ భూముల్లో మూడేళ్లకోసారి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని మేకలచెరువు, ఎదురుదోన సచివాలయాల పరిధిలోని వ్యవసాయ భూముల్లో మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా పంటలు సాగు చేయడం లాభదాయకమన్నారు. భూసార పరీక్షలతో అందులో ఉన్న పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార స్థితి, చౌడు ఇతర సమస్యలు తెలుస్తాయలన్నారు. తద్వారా ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడవచ్చో తెలుస్తుందని తెలిపారు. ఒక్కో రైతు సేవా కేంద్రం పరిధిలో 41 మట్టి నమూనాలు సేకరించాలని, కాబట్టి ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ సహాయకులకు సహకరించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు సున్నుబాషా, హరినాథ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


మేకలచెరువులో మట్టినమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

పెంపుడు కుక్కలకు నేడు టీకాలు

ధర్మవరం రూరల్: రేబీస్ సోకకుండా పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలను వేయనున్నట్లు పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ వీరభద్రయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతు ప్రపంచ జూనోసిస్ దినోత్సవంలో భాగంగా శనివారం పెంపుడు కుక్కలు, జంతువులకు టీకాలు వేస్తామన్నారు. అదే విధంగా శనివారం నుంచి 14 వరకు పశుగ్రాస వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఫర్టిలైజర్ షాపులో తనిఖీలు

హిందూపురం: వ్యవసాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు పుంగనూరు ఏడీ శివ కుమార్, విజిలెన్స్‌శాఖ రంజిత్ కుమార్, ఏలూరు వ్యవసాధికారులు సంయుక్తంగా పట్టణంలోని నందిని సీడ్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. దుకాణంలో సోర్స్ సర్టిఫికెట్ లేకపోవడంతో మొక్కజొన్న, వరి విత్తనాలు 125.345 క్వింటాళ్లు వీటి విలువ రూ.22.88 లక్షలు, ఎరువులకు సంబంధించి విలువ రూ.81,000 హ్యూమిక్ యాసిడ్ 250 లీటర్లు అమ్మకాలను నిలిపివేశారు. అలాగే ఫర్టిలైజర్ షాపుల్లో రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, మందులకు సంబంధించి రైతులకు ప్రతి బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. ఎమ్మార్పీ రేటుకే అమ్మాలని, లేకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్, ఏఓ సురేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలంకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసు

ధర్మవరం అర్బన్: ఈనెల 21న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణ, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనార్థం ఆర్టీసీ అధికారులు ఈనెల 20న ప్రత్యేక సర్వీసు నడపనున్నారు. ఈమేరకు ఆర్టీసీ డీఎం సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 20న ఉదయం 6 గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామని రాను పోను చార్జీ రూ.1,400 ఉంటుందని తెలిపారు. దర్శనానికి వెళ్లవలసిన భక్తులు ఆన్‌లైన్ లేదా బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్‌లో గాని సీట్లు రిజర్వేషన్ చేయించుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 6303151302, 9959225859 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బళ్లారి దుర్గమ్మకు ప్రత్యేక పూజలు


అలంకరణలో బళ్లారి దుర్గమ్మ

బత్తలపల్లి: మండల కేంద్రంలోని బళ్లారి దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకురాలు రాములమ్మ ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలోని డీఎం కార్యాలయంలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం మైనోద్దీన్ శుక్రవారం తెలిపారు. కదిరి డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలు ఏమైనా ఉంటే ఫోన్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. 08494-224244 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కొల్హాపురి మహాలక్ష్మీదేవికి పూజలు


అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. తర్వాత భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలు, గాజులతో పాటు వడిబియ్యం కట్టి పూలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసర ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజవంశీకుడు రంగప్పరాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన

గోరంట్ల: మండల కేంద్రమైన గోరంట్ల పంచాయతీలోని ఐదో సచివాలయం పరిధిలో శుక్రవారం డాక్టర్ వాసు ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది అతిసార, సీజినల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాసు మాట్లాడుతూ అతిసార వ్యాధి ప్రబలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, నిల్వ ఉంచిన , రోడ్డుపై ఉన్న ఆహార పదార్థాలను తినకూడదన్నారు. అలాగే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అతిసార వ్యాధి లక్షణాలు ఉన్న వారు వెంటనే ఆరోగ్య సిబ్బందిని తప్పనిసరిగా సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి రమణ, వైద్యాసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి సౌందర్య

గుడిబండ: వర్షాకాలం మొదలైనందున డయేరియా వ్యాధి బారినపడకుండా విద్యార్థులకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ సౌందర్య, పీహెచ్ఎన్ సుధారాణి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డయేరియా, పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ సౌందర్య విద్యార్థులకు పలు సూచనలు చేశారు. భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, శుభ్రమైన ఆహారం తీసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలను వినియోగించి, శరీరం మొత్తం దుస్తులు ధరించాలన్నారు. చలి, జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రధాన ఉపాధ్యాయుడు గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.